


# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 268 | శనివారం 25- అక్టోబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## ఓలా, ఉబర్‌లకు సవాల్.. మొదలుకానున్న "భారత్ టాక్సీ"




2వ

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక.. బరిలో 58 మంది




2వ

## ప్రభుత్వానికి కాసుల వర్షం కురిపించిన మద్యం దరఖాస్తులు..

- ఈ 12 చోట్ల భారీ సంఖ్యలో దరఖాస్తులు..!
- మద్యం దుకాణాల దరఖాస్తుల ద్వారా భారీగా ఆదాయం
- 2,620 దుకాణాల కోసం.. రూ.2,863 కోట్లు
- గతేడాదితో పోలిస్తే ఈసారి 218 కోట్లు అదనం



**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలో మద్యం దుకాణాల దరఖాస్తు ప్రక్రియ నిన్నటితో ముగిసింది. అయితే గత సంవత్సరంతో పోలిస్తే.. ఈసారి మద్యం దుకాణాలకు దరఖాస్తులు తక్కువగానే వచ్చాయి. అయినా సరే ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని దాదాపు చేరుకుంది. ఆదాయపరంగా చూసుకుంటే.. గత సంవత్సరం కన్నా ఈ సారి మద్యం దుకాణాల దరఖాస్తుల మీద ప్రభుత్వానికి రూ.218 కోట్లు అదనంగా వచ్చాయి.

2వ

# మరో పథకాన్ని అమలు చేసేందుకు రెడీ అవుతున్న ప్రభుత్వం..

- కేంద్ర పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు యోచన
- గర్భిణులకు రూ.5 వేల ఆర్థిక సాయం
- రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే రూ.6 వేల బహుమతి
- అంగన్‌వాడీ కార్యకర్తల భాధ్యతలు పెరుగుతాయి
- 2017 నుంచే దేశవ్యాప్తంగా అమలవుతున్న పథకం
- నిరుపేద గర్భిణులు, బాలింతలకు ఆశాకిరణం

**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మరో కొత్త పథకం అమలు చేసేందుకు ముందుకు వచ్చింది. దీని ద్వారా మహిళలకు ఆర్థికంగా సాయం అందించనున్నారు. ఇంతకు ఇది ఏ పథకం అంటే కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోన్న ప్రధాన మంత్రి మాతృ వంజన యోజన పథకం. దీన్ని రాష్ట్రంలో కూడా అమలు చేయాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది.

కేంద్ర ప్రభుత్వం గర్భవతులు, బాలితంతలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) పథకాన్ని అమలు చేస్తుంది. అయితే దీన్ని రాష్ట్రంలో కూడా అమలు చేయాలని రేవంత్ సర్కార్ యోచిస్తోంది. ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు రూ.5 వేలు సాయం చేస్తుంది. తొలి కాన్పుకు ఈ మొత్తం అందజేస్తారు. అలానే రెండో సారి ఆడపిల్ల పుడితే మరో 6 వేల రూపాయలు అందజేయనున్నారు. ఈ పథకం అమలు బాధ్యతలను తెలంగాణ రాష్ట్రంలోని శిశుసంక్షేమ శాఖ పర్యవేక్షించనున్నది.

ఈ పథకం అమలుకు సంబంధించి ఇటీవలే స్టేట్ విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపింది. ఈ స్కీమ్ ద్వారా తొలిసారి గర్భం దాల్చిన మహిళలకు 3 విడుతల్లో రూ. 5 వేల ఆర్థిక సహాయం అందిస్తారు. దీనికోసం గర్భం దాల్చిన వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ముందుగా రూ.1000 ఇస్తారు. ఆ తర్వాత గర్భం దాల్చిన 6 నెలల తర్వాత రెండో విడత కింద రూ. 2వేలు.. బిడ్డ పుట్టిన తర్వాత మొదటి దశ టీకాలు వేయించగానే మూడో విడత కింద రూ. 2 వేలు నేరుగా లబ్ధిదారు బ్యాంకు అకౌంట్‌లో జమ చేస్తారు.

రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే... ఆ తల్లికి ఒకేసారి రూ.6 వేలు అందజేస్తారు. దేశంలో ఆడపిల్లల సంఖ్యను పెంచడం, భ్రూణ హత్యలను నివారించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చింది.. విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో.. అంగన్‌వాడీ కార్యకర్తలు అర్హులైన లబ్ధిదారులను గుర్తిస్తారు. వారి పేర్లు నమోదు చేయడం.. విడతల వారీగా వారికి నగదు అందించడం వంటి బాధ్యతలను వీరే నిర్వహిస్తారు. కేంద్ర ప్రభుత్వం 2017 లో ఈ పీఎంఎంవీవైను తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా చాలా వరకు రాష్ట్రాల్లో ఈ పథకం అమలవుతోంది. కానీ తెలంగాణలో మాత్రం అమలు కావడం లేదు. ఈక్రమంలో ఈ పథకం కింద ప్రతి ఏటా కేంద్రానికి రావాల్సిన నిధులు ఆగిపోయాయి. దీంతో రేవంత్ సర్కార్ రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. దీని వల్ల నిరుపేద గర్భిణులు, బాలింతలకు లబ్ధి చేకూరుతుందనే భావిస్తున్నారు.




## ఆత్మాహుతి దాడి కుట్ర భగ్నం

ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదులు అరెస్ట్



2వ

## కుంభకర్ణుడిలా కేసీఆర్ రాజకీయం..

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సెటైర్లు



2వ

## ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాద ఘటన.. సీఎస్‌పై ఎన్‌హెచ్ఆర్‌సీ సీరియస్



2వ

## కర్నూలు బస్సు ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి..

### బాధితులకు పరిహారం

- కర్నూలు జిల్లా సరిహద్దులో విషాదం
- ఘోర ప్రమాదంపై ప్రధాని మోదీ విచారం
- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి సానుభూతి
- బైక్ ఢీకొట్టడంతో ప్రమాదం



2వ

## మీ ప్రాజెక్ట్ కాదు.. మన ప్రాజెక్ట్

ఏపీ మంత్రి నారా లోకేష్



2వ




# ఇంటర్‌లో కొత్తగా ACE గ్రూప్...

## సిలబస్ తగ్గింపు, ఫస్టియర్లోనూ ప్రాక్టికల్స్



2వ

**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):** తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అనేక చర్యలు తీసుకుంటుంది. పాఠశాల విద్యకు సంబంధించి మాత్రమే కాక.. ఇంటర్, డిగ్రీ విద్యార్థుల కోసం కూడా కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. ఈక్రమంలో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు కీలక అలర్ట్ జారీ చేసింది. ఇకపై ఫస్టియర్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనుంది. అలానే సిలబస్ తగ్గింపుకై చర్యలు తీసుకోవడమే కాక భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త కోర్సులను ప్రవేశ పెట్టనుంది.

తెలంగాణలో వచ్చే సంవత్సరం నుంచి ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ప్రస్తుతం సెకండియర్ విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్స్ నిర్వహిస్తుండగా.. వచ్చే ఏడాది నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. అలానే వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని సబ్జెక్టుల్లో రాత పరీక్షకు గాను 80 శాతం మార్కులు.. మిగతా 20 శాతం మార్కులను ఇంటర్నల్స్‌కి కేటాయించనున్నారు. ఇప్పటి వరకు కేవలం ఇంగ్లీష్‌కు మాత్రమే ఇంటర్నల్ మార్కులు ఉండగా.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి గణితం, తెలుగు ఇలా ప్రతి సబ్జెక్ట్‌కు కూడా ఇంటర్నల్ మార్కులు ఉంటాయి. ప్రాక్టికల్స్ ఉన్న సబ్జెక్టులకు కూడా ఇంటర్నల్ మార్కులు వర్తిస్తాయి.

# కుంభకర్ణుడిలా కేసీఆర్ రాజకీయం..
## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సెటైర్లు

**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):**పురాణాల్లో కుంభకర్ణుడిలా ఆరు నెలలు తిని.. ఆరు నెలలు నిద్రపోయినట్లుగా కేసీఆర్ రాజకీయం ఉందని ప్రభుత్వం విప్ బీర్ల ఐలయ్య సెటైర్లు వేశారు. ఇవాళ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ దళితులు, బడుగు బలహీనవర్గాలు ఓట్లు వేసి గెలిపిస్తేనే కేసీఆర్ సీఎం అయ్యాడని కామెంట్ చశారు. చెట్టు కింద కేసీఆర్ హాయిగా కూర్చొని కనీసం పార్టీ ఆఫీసుకు కూడా వెళ్లకుండా నాయకులను ఫామ్‌హౌస్‌కే పిలిపించుకుని మాట్లాడటం దొరతనం కాదా.. అని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ ఘన విజయం ఖాయమని చెబుతున్నారని.. అసలు డిపాజిట్ వస్తుందో రాదో చూసుకోవాలని కౌంటర్ ఇచ్చారు. తెలంగాణను సర్వనాశనం చేశావనే బీఆర్ఎస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించి ఫామ్‌హౌస్‌లో కూర్చొబెట్టినా కేసీఆర్ అహంకారం ఏమాత్రం తగ్గలేదన్నారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ లాంటి యాదవ బిడ్డను రౌడీషీటర్ అంటూ అవమానించడం సరికాదన్నారు. కేసీఆర్ అహంకారం తగ్గాలంటే నవీన్ యాదవ్‌ను జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో లక్ష మెజారిటీతో గెలిపించాలి బీర్ల ఐలయ్య ఓటర్లకు పిలుపునిచ్చారు.

# ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాద ఘటన.. సీఎస్‌పై ఎన్‌హెచ్ఆర్‌సీ సీరియస్



**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):**ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాద ఘటనలో మొత్తం 8 మంది కార్మికులు గల్లంతైన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు మనోజ్ కుమార్, గురుప్రీత్ సింగ్‌ల మృతదేహాలను మాత్రమే వెలికితీశారు. అయితే, మృతదేహాల బయటకు తీయండంలో ఎలాంటి పురోగతి లేదని కాలయాపన చేస్తున్నారంటూ ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ)లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఆయన పిటిషన్‌పై విచారణ చపట్టిన ఎన్‌హెచ్ఆర్‌సీ, ఎస్ఎల్బీసీ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని నాటి సీఎస్ శాంతికుమారికి ఆదేశాలు జారీ చేసింది. అనంతరం సీఎస్, ఇరిగేషన్ శాఖకు డీటెయిల్ రిపోర్టు ఇవ్వాలని లేఖ రాయగా.. వారు ఇచ్చిన రిపోర్టునే జాతీయ మానవహక్కుల కమిషన్‌కు అందజేశారు. దీంతో ఆ రిపోర్టు సంతృప్తికరంగా లేదని ఎన్‌హెచ్ఆర్‌సీ కామెంట్ చేసింది. ఈ ప్రమాదంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన శ్రీనివాస్, జమ్మూకశ్మీర్‌కు చెందిన సన్నీ సింగ్, జార?ండ్‌కు చెందిన సందీప్ సాహు, జగ్తా, సంతోష్ సాహు, అనుజ్ సాహు అనబడే కార్మికులు గల్లంతయ్యారని ఎన్‌హెచ్ఆర్‌సీ పేర్కొంది. అసంఘటిత కార్మికుల సంరక్షణ చట్టానికి ప్రభుత్వం తూట్లు పొడిచిందని, మృతదేహాల వెలికితీతలో పారదర్శక పూర్తిగా లోపించిందని అభిప్రాయడింది. అంతర్రాష్ట్ర వలస కార్మికుల నియంత్రణ, పని పరిస్థితుల చట్టాలను విస్మరించిన ఫైర్ అయింది. ప్రభుత్వ జాప్యం వల్లే అంచనా వేయడం, నివారణ చర్యలు చేపట్టడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వ్యాఖ్యానించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ కామెంట్ చేసింది. ఈ మేరకు ఎస్ఎల్బీసీ ప్రమాద ఘటనపై అత్యవసర చర్యలు చేపట్టి నాలుగు వారాల్లోగా పూర్తి నివేదిక ఇవ్వాలని సీఎస్ రామకృష్ణారావును ఎన్‌హెచ్ఆర్‌సీ ఆదేశించింది.

# మీ ప్రాజెక్ట్ కాదు.. మన ప్రాజెక్ట్
## ఏపీ మంత్రి నారా లోకేష్

**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):**ఆంధ్రప్రదేశ్ కు గూగుల్ డేటా సెంటర్ రావడం వెనుక 13 నెలల నిరంతర శ్రమ దాగి ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియా ఇండియా బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులతో మెల్ బోర్న్ లోని గ్రాండ్ హయత్ హొటల్ ది రెసిడెన్సీ హాల్ లో నిర్వహించిన సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షోలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నారన్నారు. పెద్ద ప్రాజెక్టులను రాష్ట్రానికి ఎలా తీసుకురావాలో ఆయనకు బాగా తెలుసని తెలపారు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉందని స్పష్టం చేశారు.

ఏపీ స్టార్టప్ స్టేట్ అని, చేపట్టిన పనులు పూర్తిచేయాలనే ధృడ సంకల్పంతో ఉన్నామని తెలిపారు. ఒకసారి మాతో చేతులు కలిపిన తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు.. మన ప్రాజెక్ట్ అని భరోసానిచ్చారు. ఇచ్చిన హామీని అమలుచేయడం మాకు చాలా ముఖ్యమని అన్నారు. అందుకు ఉదాహరణగా ఏపీలోని విశాఖలో ఏర్పాటు చేయనున్న గూగుల్ డేటా సెంటరును ఉదాహరించారు. విధానాలను సులభతరం చేయడం, అనుమతుల మంజూరు, స్థలం కేటాయింపు వంటివి ప్రభుత్వం దగ్గరుండి చూస్తోందన్నారు. అందుకే ప్రాజెక్టులు విజయవంతం అవుతాయన్నారు. ఏపీకి గత 16 నెలల్లో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం కేవలం ఆరంభం మాత్రమేనని పేర్కొన్నారు.

ప్రస్తుత ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. ఈ సవాళ్లను అవకాశాలుగా మలచుకోవాలని అభిప్రాయపడ్డారు. దేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కలిసి రాష్ట్ర, కేంద్ర స్థాయిలో చేయాల్సిన విధానపరమైన మార్పులు గుర్తించి, వాటిని అమలుచేసే పనిలో ఉన్నామని ఆస్ట్రేలియా ప్రతినిధులకు వివరించారు. ప్రస్తుతం 180 బిలియన్ల ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్నామని, దీనిని 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా తీసుకెళ్తామని చెప్పారు. కేవలం ఒకటి, రెండు రంగాలపైనే దృష్టిపెట్టకుండా 15 రంగాలపై దృష్టి కేంద్రీకరించామన్నారు. వాటిని క్లస్టర్ విధానంలో అభివృద్ధి చేస్తామన్నారు. ఆటోమోటివ్, సిమెంట్, పునరుత్పాదక రంగం, ఎలక్టానిక్స్, కంప్రెస్డ్ బయోగ్యాస్, ఫార్మా, స్టీల్, ఆక్వా, క్వాంటం కంప్యూటింగ్ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించామని ప్రకటించారు.

దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏపీ రెండో స్థానంలో ఉందన్నారు. విదేశీ పెట్టుబడుల ద్వారా త్వరలోనే నెంబర్ వన్ అవుతామని ధీమా వ్యక్తం చేశారు. కేవలం ఎంవోయూలను కుదుర్చుకోవడమే కాకుండా ప్రాజెక్టుల గ్రౌండింగ్ కోసం కృషిచేస్తున్నామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. విశాఖలో నవంబర్ 14,15 తేదీల్లో జరగబోయే పార్ట్ నర్ షిప్ సమ్మిట్ కు హాజరై పెట్టుబడులకు గల అవకాశాలను పరిశీలించాలని కోరారు.

# ఏపీ టెట్ 2025 షెడ్యూల్ విడుదల

**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):**ఏపీ టెట్ 2025 నోటిఫికేషన్ నిర్వహణకు సంబంధించిన షెడ్యూలును పాఠశాల విద్యా శాఖ విడుదల చేసింది. అక్టోబరు 24 నుంచి నవంబరు 23 వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారు. నవంబరు 25న మాక్ టెస్ట్ నిర్వహస్తారు. డిసెంబర్ 10న ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు రెండు సెషన్లలో టెట్ పరీక్షను నిర్వహిస్తారు. జనవరి 2, 2026 నుంచి 9వ తేదీ వరకు కీపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. తుది కీ జనవరి 13న విడుదల చేస్తారు. టెట్ 2025 పరీక్షా ఫలితాలను జనవరి 19న ప్రకటిస్తారు. కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ పరీక్షల నోటిఫికేషన్, సమాచార బులెటిన్, పరీక్షల షెడ్యూలు, సిలబస్, అభ్యర్థులకు సూచనలు, విధి విధానాల్ని http://tet2dsc.apcfss.in వెబ్‌సైట్‌లో చూడొచ్చని టెట్ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఒకవేళ ఎవరికైనా సందేహాలు ఉంటే 8121947387, 8125046997, 7995649286, 7995789286, 9963069286, 6281704160 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో 2011కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు కూడా ఈ నోటిఫికేషనులో పరీక్ష రాసేందుకు అవకాశాన్ని కల్పించారు. పదవీ విరమణకు ఐదేళ్లకు మించి సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు టెట్‌లో ఉత్తీర్ణులు కావాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్న ఉన్న ఉపాధ్యాయులకు టెట్ రాసేందుకు వెసులుబాటు కల్పించారు.

# ఇంటర్‌లో కొత్తగా ACE గ్రూప్...
## సిలబస్ తగ్గింపు, ఫస్టియర్లోనూ ప్రాక్టికల్స్

మొదటి పేజీ తరువాయి

దీంతో పాటు వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సు తీసుకురాబోతున్నారు. ఎకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులతో కొత్తగా 'ఏసీఈ' అనే గ్రూపును ప్రవేశపెట్టనున్నారు. అయితే ప్రస్తుత కాలంలో ఎకౌంటెన్సీకి ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ కొత్త గ్రూపును అందుబాటులోకి తెస్తున్నారు. దీంతో పాటు.. గణితం, భౌతిక, రసాయనశాస్త్రాల్లో సిలబస్‌ను తగ్గించి, ఎన్‌సీఈఆర్‌టీ ప్రమాణాలకు అనుగుణంగా మార్చనున్నారు. పాఠ్యపుస్తకాల్లో క్యూఆర్ కోడ్‌లను ముద్రించడం ద్వారా విద్యార్థులకు అదనపు సమాచారం అందుబాటులోకి రానుంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇంటర్ బోర్డు సూచించిన ప్రతిపాదనలకు తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మార్పులన్నీ 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలులోకి రానున్నాయి. ఇప్పటివరకు కేవలం ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తుండగా.. వచ్చే సంవత్సరం నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా ప్రాక్టికల్స్ తప్పనిసరి కానున్నాయి.

ప్రస్తుతం ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు చెందిన ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. అయితే మొత్తం మార్కులను రెండు సంవత్సరాలకు విభజిస్తారు. ఎలా అంటే ప్రస్తుతం ఎంపీసీ గ్రూపులో ఫిజిక్స్, రసాయనశాస్త్రం సబ్జెక్టులకు ఇంటర్ రెండో సంవత్సరంలో.. 30 మార్కులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే ఇకపై మొదటి సంవత్సరంలో ఒక్కో సబ్జెక్టుకు 15, రెండో సంవత్సరంలో 15 మార్కుల చొప్పున కేటాయిస్తారు. బైపీసీ గ్రూప్‌లో కూడా ఇలానే విభజించనున్నారు.

# ప్రభుత్వానికి కాసుల వర్షం కురిపించిన మద్యం దరఖాస్తులు..



**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):**రాష్ట్రంలో మద్యం దుకాణాల దరఖాస్తు ప్రక్రియ నిన్నటితో ముగిసింది. అయితే గత సంవత్సరంతో పోలిస్తే.. ఈసారి మద్యం దుకాణాలకు దరఖాస్తులు తక్కువగానే వచ్చాయి. అయినా సరే ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని దాదాపు చేరుకుంది. ఆదాయపరంగా చూసుకుంటే.. గత సంవత్సరం కన్నా ఈ సారి మద్యం దుకాణాల దరఖాస్తుల మీద ప్రభుత్వానికి రూ.218 కోట్లు అదనంగా వచ్చాయి. వీటి ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ.2,863 కోట్ల ఆదాయం వచ్చింది. గతంతో పోల్చితే ఇది రూ.218 కోట్లు అధికం.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం దుకాణాల కేటాయింపునకు సంబంధించి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ.. గత నెల అనగా సెప్టెంబరు 25న నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ మరసటి రోజు నుంచి అనగా సెప్టెంబర్ 26 నుంచి మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలు పెట్టింది. పోయిన మద్యం షాపుల దరఖాస్తులకు సంబంధించి.. దాదాపు 1.32 లక్షల అప్లికేషన్ల విక్రయం ద్వారా ఎక్సైజ్ శాఖకు దాదాపు రూ.2,645 కోట్ల ఆదాయం వచ్చింది. అయితే ఈసారి మాత్రం దరఖాస్తుల సంఖ్య భారీగా తగ్గింది.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం షాపులకు ఈసారి కేవలం 95,436 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అయితే ఈసారి అప్లికేషన్ల సంఖ్య తగ్గినా.. దరఖాస్తు రుసుమును పెంచడంతో ప్రభుత్వం అనుకున్న లక్ష్యం చేరింది. గతంలో దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు ఉండగా.. ఈసారి ఆ మొత్తాన్ని రూ.3 లక్షలకు పెంచారు. అలానే మద్యం దుకాణాల అప్లికేషన్ల విక్రమం ద్వారా రూ.3 వేల కోట్ల ఆదాయం ఆర్జించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దాదాపు చేరుకుంది.

ఈసారి ఎక్సైజ్ శాఖ అధికారులు.. ఎక్కువ సంఖ్యలో జనాలు.. మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునేలా విస్తృతంగా ప్రచారం కూడా చేశారు. ఈ నెల 18 అర్ధరాత్రి వరకు 89,344 మంది దరఖాస్తు చేశారు. అయితే అదే రోజు తెలంగాణ వ్యాప్తంగా బీసీ బంద్‌కు పిలుపునివ్వడంతో.. ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోలేకపోయారు.

దీంతో పలువురు వ్యాపారుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం నెల 23 వరకు గడువు పొడిగించింది. దీంతో 95 వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయి. ఇక ఈనెల అనగా అక్టోబర్ 27న డ్రా తీసి వ్యాపారులను ఎంపిక చేయనున్నారు. డిసెంబర్ ఒకటి నుంచి కొత్త దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈసారి ఒక్కో అప్లికేషన్‌కు రూ.3 లక్షల ఫీజు తీసుకున్నారు. ఇది నాన్ రిఫండబుల్. అలానే ర2023లో వచ్చిన అప్లికేషన్ల సంఖ్య 1.31 లక్షలు కాగా ఈ సారి దాదాపు 36 వేల అప్లికేషన్లు తగ్గాయి. ఫీజు రూ.3 లక్షలు చేయడంతో ఈ సారి అప్లికేషన్లు తగ్గినా ఆదాయం క్రితం సారి వచ్చినందే వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఒక్కో మద్యం దుకాణానికి సగటున 36 దరఖాస్తులు వచ్చాయి. మద్యం దుకాణాల దరఖాస్తుల్లో శంషాబాద్ ఎక్సైజ్ డివిజన్ నుంచి అత్యధికంగా అప్లికేషన్లు వచ్చాయి. 8,502 అప్లికేషన్లతో శంషాబాద్ డివిజన్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక కుమ్రం భీం నుంచి అత్యల్పంగా దరఖాస్తులు వచ్చాయి. ఇక్కడ నుంచి కేవలం కేవలం 667 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# ఓలా, ఉబర్‌లకు సవాల్..
## మొదలుకానున్న "భారత్ టాక్సీ"

**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):**కేంద్రం "భారత్ టాక్సీ"ని ప్రారంభించింది. ఇది ఓలా, ఉబర్ వంటి ప్రైవేట్ ప్లాట్‌ఫారమ్‌లను నేరుగా సవాల్ చేయనుంది. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ, జాతీయ ఇ-గవర్నెన్స్ డివిజన్ లు ఈ సర్వీస్‌ను ప్రారంభించాయి. డ్రైవర్లకు వారి సంపాదనపై పూర్తి హక్కును ఇవ్వడంతో పాటు ప్రయాణికులకు ప్రైవేట్ క్యాబ్ అగ్రిగేటర్లకు బదులుగా ప్రభుత్వ పర్యవేక్షణలో ప్రత్యామ్నాయాలను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. చాలా ఏళ్లుగా ప్రైవేట్ క్యాబ్ సంస్థలపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. టాక్సీ సేవలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఛార్జీలు పెంచడం, ఏకపక్షంగా రైడ్‌లను రద్దు చేయడంతో పాటు ధరలు ఆకస్మిక పెరుగుదలపై పలువురు ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో పాటు ఈ సంస్థల కింద క్యాబ్‌లు నడుపుతున్న డ్రైవర్లు, తమకు వచ్చే డబ్బులో ఎక్కువ మొత్తం కమిషన్లు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. కంపెనీలు వసూలు చేసే అధిక కమీషన్ రేట్లపై చాలా మంది డ్రైవర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు, తరచుగా వారి ఛార్జీల ఆదాయంలో 25 శాతం వరకు కోల్పోతారు.కొత్తగా తీసుకువస్తున్న భారత్ టాక్సీ ప్లాట్‌ఫామ్ దీనిని మార్చడానికి ప్రయత్నిస్తుంది. ప్రైవేట్ అగ్రిగేటర్లలా కాకుండా, భారత్ టాక్సీ డ్రైవర్లు తమ రైడ్ డబ్బుల్లో కమిషన్లు చెల్లించాల్సిన అవసరం లేదు. నామమాత్రపు రోజూవారీ లేదా నెలవారీ రుసుము మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. దీని వల్ల డ్రైవర్లు ఎక్కువగా సంపాదించుకునే వీలు కలుగుతుంది. భారత్ టాక్సీ పైలట్ దశ నవంబర్ ఢిల్లీలో ప్రారంభం కానుంది. 650 వాహనాలు సేవలు అందించనున్నాయి. ఇది విజయవంతమైతే, పూర్తిస్థాయిలో దేశవ్యాప్తంగా ఇతర నగరాల్లో డిసెంబర్‌లో ప్రారంభించే అవకాశం ఉంది. తరువాత ఈ సేవలు ముంబై, పూణే, భోపాల్, లక్నో , జైపూర్‌తో సహా 20 నగరాలకు క్రమంగా విస్తరించనున్నారు. మార్చి 2026 నాటికి దేశవ్యాప్తంగా మెట్రో నగరాలకు ఈ సేవలు విస్తరించాలని భావిస్తున్నారు. 2030 నాటికి, ఈ ప్లాట్‌ఫామ్ జిల్లా ప్రధాన కార్యాలయాలు, గ్రామీణ ప్రాంతాలకు చేరుకునేలా 1 లక్ష మంది డ్రైవర్లను కలిగి ఉంటుందని భావిస్తున్నారు.

# ఆత్మాహుతి దాడి కుట్ర భగ్నం..
## ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదులు అరెస్ట్

**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):**దేశ రాజధాని ఢిల్లీలో ఐఈడీ పేలుళ్లు, ఆత్మాహుతి దాడికి ప్లాన్ చేసిన ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదులను ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇస్లామిక్ స్టేట్ నుంచి ప్రేరణ పొందిన ఆ ఇద్దరినీ నిఘా సంస్థలు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాయి. అరెస్టైన వ్యక్తులు ఆత్మాహుతి దాడులకు శిక్షణ పొందినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఒకరిని మధ్యప్రదేశ్ లోనే అరెస్ట్ చేసి.. ఢిల్లీకి తరలించారు. మరొకరిని అద్నాన్ అనే వ్యక్తిగా గుర్తించారు. ఈ ఆపరేషన్‌లో పూర్తి నెట్వర్క్‌ను వెలికితీసి.. మాడ్యూల్‌లోని ఇతర సభ్యుల్ని కూడా గుర్తించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. అడిషినల్ కమిషనర్ ప్రమోద్ కుష్వాహా, ఏసీపీ లలిత్ మోహన్ నేగి నేతృత్వంలో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు వివవరించారు.

# కర్నూలు బస్సు ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి..
## బాధితులకు పరిహారం

**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా సరిహద్దులో ఊహించని విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ప్రయాణికులతో వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్‌కు చెందిన ఓ ప్రైవేటు బస్సు ఘోర అగ్ని ప్రమాదానికి గురైంది. బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో..ఈ దారుణ ఘటనలో 20 మందికి పైగా ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. నడిరోడ్డుపై జరిగిన ఈ ఘోర దుర్ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించింది. అయితే తాజాగా ఈ ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అంతేకాకుండా బాధితులకు పరిహారాన్ని కూడా ప్రకటించారు.

కర్నూలు జిల్లాలో సంభవించిన ఈ రోడ్డు ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ విపత్కర సమయంలో తన ఆలోచనలన్నీ ఆప్తులను కోల్పోయి బాధ పడుతున్న కుటుంబాల గురించేనని చెప్పుకొచ్చారు. ఇదే విషయాన్ని ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి అధికారిక ప్రకటించింది. అలాగే ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి నుంచి పరిహారాన్ని ప్రకటించారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం అందించనున్నారు. అలాగే తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున సహాయం అందించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

మరోవైపు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా ఈ ఘోర ప్రమాదంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ప్రాణనష్టం జరగడం తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్రపతి కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ ఘటనపై ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ కూడా స్పందించారు. జరిగిన ఈ ఘోర ప్రమాదం తనను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన సంతాపం ప్రకటించడంతో పాటు క్షతగాత్రులు వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అసలేం జరిగిందంటే?


కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు దగ్గర శుక్రవారం తెల్లవారజామున కావేరి ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సుకు మంటలు అంటుకున్నాయి. ముఖ్యంగా బస్సును బైక్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. బైక్ ఢీకొట్టిన తర్వాత కూడా బస్సు 300 మీటర్ల దాన్ని లాక్కొని వెళ్లిపోగా.. ముందు భాగంలో మంటలు ప్రారంభం అయ్యాయి. ఆ తర్వాత కాసేపటికే బస్సు మొత్తం మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న వ్యక్తి సహా 20 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. మరికొంత మంది గాయపడగా వారిని కర్నూలు ప్రభుత్వాసుపత్రకి తరలించారు. ప్రస్తుతం వారంతా అక్కడే చికిత్స పొందుతున్నారు.

# చిత్తూరు మేయర్ దంపతుల హత్య కేసు..
## న్యాయస్థానం సంచలన తీర్పు

**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):**రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన చిత్తూరు మాజీ మేయర్ అనురాధ, ఆమె భర్త కటారి మోహన్ జంట హత్యల కేసుకు సంబంధించి చిత్తూరులోని ప్రత్యేక మహిళా న్యాయస్థానం ఇవాళ సంచలన తీర్పును వెలువరించింది. కేసులో పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన తర్వాత ఏ1 నుంచి ఏ5గా ఉన్న ముద్దాయిలపై హత్యాయత్నం నేరం రుజువైందన్న కోర్టు స్పష్టం చేసింది. అదేవిధంగా దోషులకు ఈనెల 27 వరకు జ్యూడిషియల్ కస్టడీ విధించింది. అదేవిధంగా ఏ6 నుంచి ఏ 23 వరకు ఉన్న ముద్దాయిలపై కేసును న్యాయస్థానం కొట్టివేసింది. వారికి సంబంధించిన బెయిల్ బాండ్లు ఆరు నెలల పాటు అమల్లో ఉండాలని కోర్టు పోలీసులను ఆదేశించింది.

కాగా, 2015 నవంబర్ 15న చిత్తూరు మునిసిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అనురాధ, భర్త మోహన్‌లను దుండగులు తుపాకీలతో కాల్చి, కత్తులతో నరికి చంపారు. ఈ హత్యకు సంబంధించి మొత్తం 23 మంది నిందితులను చార్జిషీటులో చేర్చుతూ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, కేసులో నిందితుడిగా ఉన్న కాళహస్తికి చెందిన కాసారం రమేష్ క్వాష్ పిటిషన్ దాఖలు చేయడంతో అతడిని కేసు నుంచి తొలగించారు. మరో నిందితుడు శ్రీనివాస ఆచారి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో నిందితులుగా 21 మంది మిగిలారు. చింటూ ప్రధాన నిందితుడిగా వెంకటాచలపతి, జయప్రకాష్ రెడ్డి, మంజునాథ్, వెంకటేష్, మురుగన్, యోగానంద్, పరందామ, హరిదాస్, మొగిలి, శశిధర్, యోగానందం, ఆర్వీటీ బాబు, లోకేష్, రఘుపతి, నాగరాజు, ఆనంద కుమార్, కమలాకర్, రజనీకాంత్, నరేంద్రబాబు, సురేష్ పేరిట పోలీసులు కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో దాదాపు 163 మంది వరకు సాక్షులుగా ఉన్నారు. కేసు మొత్తాన్ని విచారించిన చిత్తూరులోని ఆరో అదనపు జిల్లా న్యాయస్థానం పరిధిలోని మహిళా ప్రత్యేక కోర్టు ఇంచార్జ్ న్యాయమూర్తి ఎం.శ్రీనివాసరావు తీర్పును వెలువరించారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక.. బరిలో 58 మంది




**న్యూస్ డెస్క్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):**జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బరిలో 58 మంది అభ్యర్థులు ఖరారయ్యారు. ఈమేరకు రిటర్నింగ్ అధికారి సాయిరాం వివరాలు వెల్లడించారు. బైపోల్ లో మొత్తం 211 మంది నామినేషన్లు దాఖలు చేయగా, 81 మంది అర్హత సాధించారు. వీరిలో 23 మంది నామినేషన్లను ఉపసంహరించారు. ఇంత పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పోటీ చేయడం జూబ్లీహిల్స్ చరిత్రలో ఇది తొలిసారి కావడం గమనార్హం. గత ఎన్నికల్లో 2009లో 13, 2014లో 21, 2018లో 18, 2023లో 19 మంది అభ్యర్థులు ఇక్కడినుంచి పోటీ చేశారు. 2023లో బీఆర్ఎస్ నుంచి మాగంటి గోపీనాథ్ ఎన్నికయ్యారు. కానీ ఆయన మరణంతో ఉపఎన్నిక అనివార్యం అయింది. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలతో పాటు స్వతంత్రులు, విద్యార్థి సంఘాలు, రైతులు భారీగా పోటీలో ఉన్నారు. అయితే తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి, ప్రజల దృష్టికి తీసుకురావడానికి స్వతంత్ర అభ్యర్థులు భారీగా నామినేషన్లు వేశారు. రీజినల్ రింగు రోడ్డు భూసేకరణ నిర్వాసితులు 12 మంది, యాచారం ఫార్మాసిటీ భూ నిర్వాసితులు 10 మంది, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా 10 మంది, ఉద్యోగ నియామకాల కోసం నిరుద్యోగ జేఏసీ తరఫున 13 మంది, పింఛన్ల కోసం 9 మంది సీనియర్ సిటిజన్లు, తెలంగాణ ఉద్యమకారుల తరఫున ఒకరు నామినేషన్లు వేశారు. ఈ భారీ నామినేషన్లు, ఉత్కంఠభరిత వాతావరణం నడుమ జూబ్లీహిల్స్ ఉపఎన్నిక చర్చనీయాంశంగా మారింది.

## క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడిన చింతల రమేష్ డివైఎఫ్ఐ సంఘం నుంచి బహిష్కరణ

### డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ




**ఖమ్మం టౌన్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):** క్రమశిక్షణ రాహిత్యానికి, అన్యవర్గ దోరనులకు పాల్పడిన చింతల రమేష్ ను భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ బషీరుద్దీన్, జిల్లా కార్యదర్శి బొడ్డు మధు లు తెలియజేశారు. ఈ సందర్భంగా షేక్ బషీరుద్దీన్, బొడ్డు మధు మాట్లాడుతూ చింతల రమేష్ సంఘంలో క్రమశిక్షణ రాయిత్యానికి పాల్పడిన కారణంగా ఆయన సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్టు వాళ్ళు తెలియజేశారు. ఈ విధంగా చింతల రమేష్ సంఘం క్రమశిక్షణకు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తుండడంతో ఆ సందర్భంగా రాష్ట్ర నాయకులు చింతల రమేష్ ను మందులించి యాక్షన్ తీసుకోవడం జరిగిందని వారి తెలియజేశారు. మళ్లీ ఇదే వైఖరితో ఉన్న రమేష్ పై డివైఎఫ్ఐ జిల్లా కమిటీ క్రమశిక్షణ చర్యలు తీసుకొని రాష్ట్ర కమిటీకి పంపిందని, ఇట్టి విషయం తెలిసిన రమేష్ సంఘానికి రాజీనామా పత్రం పంపించాడని వారు తెలియజేశారు.రమేష్ పంపిన రాజీనామా పత్రాన్ని తిరస్కరిస్తూ రమేష్ సంగం నుంచి బహిష్కరిస్తున్నట్లు వారి తెలియజేశారు. ఈరోజు నుంచి సంఘ కార్యక్రమాలకు రమేష్ కు ఎటువంటి సంబంధం ఉండదని వాళ్ళు తెలియజేశారు. డివైఎఫ్ఐ సంఘం దేశభక్తియుతమైన సంఘమని, అందరికీ విద్య ఉపాధి లభించాలని, సోషలిజం అంతిమ లక్ష్యంగా పనిచేస్తున్న సంఘమని, క్రమశిక్షణ కలిగి స్వార్థం లేకుండా త్యాగం చేస్తూ యువజన కోసం పనిచేస్తున్న సంఘంలో ఇట్లాంటి అరాచక నాయకులు ఉండడం సరైనది కాదని వారు అన్నారు.

## యువత రాజకీయాల్లోకి రావాలి

### స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారికి తగిన గుర్తింపు

### నేటితరం యువత చైతన్యం కావాలి

### తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ పిలుపు




**ఖమ్మం టౌన్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):** రాజకీయంలో రాణించాలనుకునే యువతకు తమ పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక అయ్యేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలుకర రవికుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో విస్తృతమైన ప్రచారాన్ని నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేసేందుకు కార్యాచరణ రూపొందించామని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం యువతీ యువకులకు కనిపిస్తున్నామని, సర్పంచులుగా, ఎంపీటీసీ, జడ్పిటిసి, ఇతర ఎన్నికల్లో జరిగిన ఆ ఎన్నికలలో పోటీ చేసేందుకు తమ పార్టీ అవకాశం కల్పిస్తుంది అన్నారు . బి ఫామ్ తక్షణమే అందజేసి వాటికి తగిన గుర్తింపు ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ మరింత బలోపేతం చేసే లక్ష్యంలో భాగంగా ఇప్పటికే అనేక జిల్లాలలో పర్యటనలు నిర్వహిస్తూ ప్రజలకు చేరువ అవుతున్నామని, ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక అయ్యేందుకు తమ పార్టీ మంచి అవకాశాన్ని కల్పిస్తుందని, యువతీ యువకులు రాజకీయ చైతన్యం కలిపినప్పుడే ఈ సమాజం మరింత ముందుకు వెళుతుందని, ప్రజలకు సేవ చేయాలని దృక్పథం కలిగి ఉండాలని అటువంటి వారిని తమ పార్టీ సంపూర్ణంగా ఆహ్వానిస్తుందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ స్టార్ క్యాంపినర్, ఐ ఐ ఎస్ రిటైర్డ్ అధికారి కోనప్పరెడ్డి హరిప్రసాద్, పార్టీ రాష్ట్ర నేతలు స్టీవెన్, మేకల సారయ్య, చెరుకూరి రత్నరాజు, జాను ప్రభాకర్, జన్ను జాన్ తదితరులు పాల్గొన్నారు.

## కర్నూల్ బస్సు ప్రమాదంపై దిగ్భ్రాంతి...

### మాజీ ఎంపీ నామ



**హైదరాబాద్ బ్యూరో, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):** హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న ట్రావెల్స్ బస్సుకు కర్నూలు జిల్లాలో చోటుచేసుకున్న ఘోర బస్సు ప్రమాదం పట్ల బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన ప్రయాణికుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ దుర్ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరటం తో పాటు, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాద ఘటనలోని బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని నామ కోరారు.

## ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి భూమి కేటాయింపు-వడ్డెబోయిన హర్షం



**ఖమ్మం టౌన్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరావు గారి విన్నపంతో సీఎం రేవంత్ రెడ్డి ఆమోదంతో భూమి కేటాయింపు బురాన్ పురం లోని ఎన్.ఎస్.పి సర్వేనెంబర్ 93లో ఎకరం స్థలం కేటాయించడం పట్ల ఓ బి సి సి ఉపాధ్యక్షులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు వడ్డెబోయిన నరసింహారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వడ్డెబోయిన మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కొత్త కార్యాలయం నిర్మాణం కోసం ప్రభుత్వం ఒక ఎకరం స్థలం కేటాయించిందని ఈ ప్రతిపాదనకు గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపారని దీనితో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులలో కార్యకర్తల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపిందని ఈ నేపథ్యంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన కొత్త కార్యాలయం నిర్మాణం అవసరమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువాళ్ళ దుర్గ ప్రసాద్ 2024 ఫిబ్రవరి 21న రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రం అందజేశారు. గతంలో 2007లో కాంగ్రెస్ పార్టీ అధికారం ఉన్న సమయంలో జిల్లాలో అతిపెద్ద పార్టీగా ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కూడా వనమా వెంకటే శ్వరరావు జిల్లా అధ్యక్షులుగా ఉన్నప్పుడు జిల్లా స్థాయి సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కొత్త కార్యాలయం కావాలని అప్పుడున్నటువంటి ఎంపీ, ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీలకు ఆనాటి కాంగ్రెస్ నాయకులు వడ్డెబోయిన నరసింహారావు సూచించారు. మంత్రివర్యులు తుమ్మల చోరవతో ముఖ్యమంత్రికి లేఖ అందించగా ఈ వినతిని సానుకూలంగా పరిగణించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పార్టీకి శాశ్వత కార్యాలయం ఉండటం అవసరమని పార్టీ కార్యకలాపాల విస్తరణకు ఇది దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్లో ఆమోదించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకి మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరావుకి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మాజీ కేంద్రమంత్రి రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరికి ఖమ్మం పార్లమెంటు సభ్యులు రఘురాం రెడ్డి గారికి ధన్యవాదాలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఇది చారిత్రాత్మక నిర్ణయమని ఆయన అన్నారు.

## యస్.బి.ఐ.టి. విద్యార్థికి 2 లక్షల ఆర్థిక చేయూత



**ఖమ్మం ఎడ్యుకేషన్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):** ప్రమాదంలో తన తండ్రిని కోల్పోయిన తమ కళాశాల విద్యార్థి అప్పికట్ల సాయికిరణ్ కు ఆర్థికంగా చేయూతను అందించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలి పారు. గత ఫిబ్రవరి నెలలో జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామానికి చెందిన అప్పికట్ల బాలకృష్ణ వ్యవసాయ పనులలో ప్రమాదవశాత్తు మృతి చెందటంతో విద్యార్థి చదువులకు ఇబ్బంది కలుగకుండా ఉండేలా నేషనల్ ఇన్సురెన్స్ ద్వారా 2 లక్షల రూపాయల చెక్కును శుక్రవారం కళాశాలలో విద్యార్థికి అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి ని ధైర్యపరుస్తు, కళాశాల యాజమాన్యం ఎల్లపుడూ తోడుగా ఉంటుందని భరోసానిచ్చారు. ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల వల్ల లేదా ప్రమాదవశాత్తు తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు తమ కళాశాల అండగా ఉంటుందని, అర్ధంతరంగా విద్యకు ఆటంకం కలగకూడదనే సదుద్దేశంతో ఈ పథకాన్ని అవలంభిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా.. జి. ధాత్రి తెలిపారు. కళాశాలలోని ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ , పి.జి. విద్యార్థులందరికి ప్రతి సంవత్సరం ప్రమాదభీమా పథకాన్ని కళాశాల యాజమాన్యం పునరుద్దిస్తున్నా రని కళాశాల ప్రిన్సిపల్ డా.. జి. రాజ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా.. ఎ.వి.వి. శివ ప్రసాద్, డా.. జె. రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐలో చేరిన డి.వై.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షుడు చింతల రమేష్



**ఖమ్మం బ్యూరో, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):** యువ కమ్యూనిస్టులతోనే కమ్యూనిస్టు పార్టీ సీపీఐకి పూర్వ వైభవం వస్తుందని,కామ్రేడ్ చింతల. రమేష్ పార్టీలో చేరడంతో చాలా సంతోషంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, యం.ఎల్.ఏ కూన%శీ%నేని.సాంబశివరావు వెల్లడించారు. స్థానిక గిరి ప్రసాద్ భవన్ లో సీపీఐ జిల్లా కార్యాలయంలో సిపిఎం యువజన విభాగం డి.వై.ఎఫ్.ఐ జిల్లా అద్యక్షుడు చింతల రమేష్, చిమ్మపూడి గ్రామ సిపిఎం శాఖ కార్యదర్శి రెమల్లె జైపాల్, శాఖ సభ్యులు జ్యోతిబస్, చంద్రమ్మ, మల్లెంపాటి రమేష్ లతో పాటు మరికొంతమంది కార్యకర్తలు సిపిఎం పార్టీకి మూకుమ్మడిగా రాజీనామాలు చేసి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు భాగం హేమంత్ రావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఇతర జిల్లా నాయకత్వం సమక్షంలో సీపీఐ పార్టీలో చేరడం జరిగింది. చింతల రమేష్ కి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, యం.ఎల్.ఏ కూన%శీ%నేని సాంబశివరావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధరంగ ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ యువ కమ్యూనిస్టులతోనే కమ్యూనిస్ట్ పార్టీలు బలోపేతం అవుతాయని, చిమ్మపూడి గ్రామం నుండి గత 15 సంవత్సరాలుగా వామపక్ష ఉద్యమాలలో పనిచేసిన చింతల రమేష్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. డిసెంబర్ 26న కమ్యూనిస్ట్ పార్టీ వందేళ్ల వేడుక ఉద్యమాల గుమ్మం ఖమ్మం అయిందని అయిదు లక్షల మందితో భారీ బహిరంగ సభ ఉంటుందని ఖమ్మం జిల్లాలో ఉన్న పార్టీ శ్రేణులు అహర్నిశల కృషి చేసి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభలో సీపీఐ జాతీయ కమిటీ సభ్యులు భాగం హేమంత్ రావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మెన్ మౌలానా,జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ జిల్లాలో డిసెంబర్ 26న జరిగే భారీ బహిరంగ సభ ద్వారా సీపీఐ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని, పార్టీ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పార్టీని బలోపేతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు జానీమియా, గోవిందరావు, సలాం, సింగు నరసింహారావు, మేకల శ్రీనివాసరావు, పోటు కళావతి, సీతామహాలక్ష్మి, తాటి వెనకటేశ్వరావు పగడాల మల్లేష్, యానాల సాంబశివారెడ్డి, రఘునాథపాలెం మండల కార్యదర్శి శాకమూరి శ్రీనివాస్ విద్యార్థి, యువజన నాయకులు నానాబాల రామకృష్ణ ,ఇటికల రామకృష్ణ,మడిపల్లి లక్ష్మణ్ సమితి సభ్యులు తాటి నిర్మల, శ్రావన్, సైదా, నాగుల్ మీరా, జూల వెంకటేశ్వర్లు, ప్రొద్దుటూరు వెంకటరెడ్డి, గాడిచర్ల సత్యనారాయణ రఘుంధపాలెం మండల, చిమ్మపూడి గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మహోన్నత వ్యక్తి ప్రతాపనేని సత్యనారాయణ

### సీపీఎం సీనియర్ నాయకులు ఆనంతనేని వీరయ్య



**ఖమ్మం రూరల్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):** మహోన్నత వ్యక్తి ప్రతాపనేని సత్యనారాయణ అని సీపీఎం సీనియర్ నాయకులు ఆనంతనేని వీరయ్య అన్నారు. మండలంలోని కామంచికల్ గ్రామంలో అమరజీవి ప్రతాపనేని సత్యనారాయణ తొమ్మిదవ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చెరుకూరి రామకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వీరయ్య మాట్లాడుతూ.... కామంచికల్ గ్రామానికి 35 సంవత్సరాలు ఏకగ్రీవంగా పంచాయతీ సర్పంచ్ గా పని చేసిన మార్క్సిస్టు నాయకుడన్నారు. పది ఎకరాల భూమిని అమ్మి గ్రామంలో హై స్కూల్ కట్టించిన విద్యా దాత అన్నారు. గ్రామంలో 150 ఇళ్ళు కట్టించిన ఘనత సత్యనారాయణకే దక్కుతుందన్నారు. కరెంట్ లేని రోజుల్లో లాంతర్లు పెట్టి చదువు చెప్పించిన మహనీయుడు సత్యనారాయణ అన్నారు. ఎటువంటి సౌకర్యాలు లేని రోజుల్లో విద్య నేర్చుకునేందుకు గ్రామ ప్రజలకు అనేక సౌకర్యాలు కల్పించిన మహనీయుడు సత్యనారాయణ అన్నారు. సత్యనారాయణ కట్టించిన బడిలో చదివి ఎంతోమంది ఉన్నత పదవులు పొందారని తెలిపారు. సత్యనారాయణ ఆశయాలు సాధించేందుకు నిత్యం కృషి చేస్తున్న ఆయన కుమారుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లును గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చెరుకూరి వెంకట నరసయ్య, హనుమంతు శేషగిరి, జంగం లక్ష్మి, డివైఎఫ్ఐ నాయకుడు వెంకన్న,బొప్పి శ్రీను, రాజు నాయకులు వెంకమ్మ, సరస్వతి ప్రతాపనేని సత్యనారాయణ కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు వీ.జ్యోతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# డీజీపీని కలిసిన ఖమ్మం బీజేపీ నేతలు

## 4 అంశాలపై వినతిపత్రం సమర్పణ

## ఫిర్యాదు అంశాలను పరిశీలిస్తానని డిజిపి హామీ



**ఖమ్మం బ్యూరో, 24 అక్టోబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లాలో ప్రజల భద్రత, సామాజిక న్యాయం, జరుగుతున్న అక్రమాలపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా నాయకత్వం రాష్ట్ర పోలీసు ప్రధానాధికారి (డీజీపీ)ని నేరుగా సంప్రదించింది. శుక్రవారం హైదరాబాద్‌లో భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల కో-ఇన్చార్జ్ జాతీయ నేత పొంగులేటి సుధాకర్ రెడ్డి, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు లతో కూడిన జిల్లా బృందం డీజీపీని కలిసి, నాలుగు కీలక అంశాలను స్పష్టంగా ప్రస్తావిస్తూ వినతిపత్రాన్ని సమర్పించింది. వినతిపత్రంలో ప్రధానంగా నాలుగు అంశాలను నేతలు ప్రస్తావించారు. మొదటగా, అక్టోబర్ 18న సత్తుపల్లిలో జరిగిన బీసీ బంద్ సందర్భంగా కాంగ్రెస్ నేతలు కమల్ పాషా తదితరులు బీజేపీ సత్తుపల్లి మండల అధ్యక్షులు బానోతు విజయ్ లతోపాటు కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారని నేతలు ఫిర్యాదు చేశారు. శాంతియుతంగా సాగుతున్న బంద్ కార్యక్రమానికి భంగం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాక, కమల్ పాషా ప్రజలను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నాడని, ప్రభుత్వ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నాడని వారు ఆరోపించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలను అడ్డుకునేందుకు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రెండవ అంశంగా, పెనుబల్లి మండలం ఎరుగట్ల గ్రామంలో ఇందిరమ్మ హౌసింగ్ పథకం కింద లబ్ధిదారుల ఎంపికలో జరిగిన భారీ అవకతవకలపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు, బోర్లు ఉన్నవారికి ఇళ్లు కేటాయించడం, గుడిసెల్లో ఉన్న పేదలను నిర్లక్ష్యం చేయడం సామాజిక అన్యాయమని వారు డీజీపీ దృష్టికి తీసుకువచ్చారు. మూడవదిగా, ఖమ్మం-ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో గోవుల అక్రమ రవాణా నిరంతరం కొనసాగుతోందని, దీనిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్న గోరక్షకులు బెదిరింపులకు గురవుతున్నారని నేతలు తెలిపారు. గోవుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అలాగే గోరక్షకులకు పోలీసు రక్షణ కల్పించాలని వారు డీజీపీకి విజ్ఞప్తి చేశారు. చివరి అంశంగా, ఖమ్మం జిల్లాలో గంజాయి అక్రమ రవాణా కొనసాగుతుందని, ఈ విషయంపై గతంలో అనేకసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అక్రమ రవాణా అలాగే సాగుతుందని నేతలు వివరించారు. ప్రధానంగా ఖమ్మం పట్టణంలో కళాశాలలు, పాఠశాలలను అడ్డాగా చేసుకుని గంజాయి వ్యాపారం గుట్టు చప్పుడు కాకుండా తిరుగుతుందని బీజేపీ తరఫున ఫిర్యాదు చేశారు. డీజీపీ వినతిపత్రాన్ని స్వీకరించి, ప్రస్తావించిన అంశాలను పరిశీలిస్తానని హామీ ఇచ్చినారు. జిల్లాలో చట్టవ్యవస్థను కాపాడి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారని నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. డీజీపీని కలిసిన వారిలో నాయకులు దేవకి వాసుదేవరావు, ఈ వి రమేష్, నంబూరి రామలింగేశ్వరరావు, నాయుడు రాఘవరావు లు కూడా ఉన్నారు.

# ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవడంపై స్పందించిన జాన్వీ కపూర్



మూవీ న్యూస్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్): అందం కోసం హీరో, హీరోయిన్లే కాకుండా సాధారణంగా ప్రజలు కూడా పలు ప్రయత్నాలు చేస్తున్నారు. బ్యూటీ పార్లర్స్‌కు వెళ్లడం పలు విధాల ప్రయత్నాలు చేస్తూ అందంగా మారిపోతున్నారు. ఇక హీరోయిన్ల విషయానికొస్తే.. ఇండస్ట్రీలో రాణించేందుకు ఎంతకైనా తెలగించేస్తారు. కొందరు గ్లామన్ డోస్‌తో పాపులారిటీ దక్కించుకుంటే.. మరికొందరు మాత్రం తమ అందంతోనే మంత్రముగ్ధులను చేస్తుంటారు. ఇంకా కొందరైతే.. ప్లాస్టిక్ సర్జరీలు చేయించుకుని తమ బాడీలో సరిగ్గా లేని భాగాన్ని సరి చేసుకుంటుంటారు. ఇలా సినిమా ఇండస్ట్రీలో ఎంతోమంది ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారు. ఇక అతిలోక సుందరి శ్రీదేవి కూతురుగా వచ్చిన జాన్వీ కపూర్ కూడా ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈక్రమంలో.. తాజాగా, జాన్వీ కపూర్ 'టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్' టాక్ షోలో పాల్గొని క్లారిటీ ఇచ్చింది. "నా ప్రతి నిర్ణయం వెనుక మా అమ్మ సలహా ఉంది.

ఆమె అనుభవం వల్ల నేను తప్పులు చేయకుండా ఉంటున్నాను. యువతులు సోషల్ మీడియాలో చూసిన దాన్ని బ్లైండ్‌గా ఫాలో అవ్వకూడదు. ఎవరో చేసినట్లు మనం సర్జరీ చేయించుకోవాలని అనుకోవడం ప్రమాదకరం. అందుకే పారదర్శకత చాలా ముఖ్యం. ఎవరో డాక్టర్‌లుగా నటిస్తూ, ఒక నటికి చేసిన సర్జరీల లిస్ట్ చూపిస్తూ వీడియోలు చేస్తారు. అలా నా ఫొటో పెట్టి బఫెలో ప్లాస్టీ చేసుకుందట అని చెప్పారు. అది చూసిన నేను షాక్ అయ్యా. అలాంటి తప్పుడు సమాచారం విని ఎవరైనా యువతి ప్రయత్నించి ఏదైనా తప్పు జరిగితే, అది భయంకరమైన విషయం యువతులు తమ శరీరాన్ని ప్రేమించాలి. మనం మనల్ని అంగీకరించడం సిగ్గు కాదు. సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు మన మనసును ప్రభావితం చేయొద్దు. ప్రతి ఒక్కరికీ అందం అంటే వేరు. ఎవరు చెప్పిన స్టాండర్డ్స్‌కి లోబడవద్దు" అని చెప్పుకొచ్చింది.

# మూడేళ్ల క్రితం ప్రాణాంతకమైన జబ్బు..

## భరించలేనంత బాధను జయించాను..!





స్పోర్ట్స్ న్యూస్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్): మైదానంలో అతడొక పరుగుల యంత్రం. క్రీజులోకి వచ్చాడంటే మెరుపు షాట్లతో ప్రత్యర్థి బౌలర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తాడు. ఐపీఎల్‌లో ఎన్నో మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడిన ఈ కుర్రాడు.. టీమిండియా మ్యాచ్ విన్నర్‌గా అవతరించాడు. ఇటీవలే ఆసియా కప్ ఫైనల్లో పాకిస్థాన్‌పై ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా.. జట్టును ఒంటిచేత్తో గెలిపించాడు తిలక్ వర్మ . ఉత్కంఠ రేపిన ఫైనల్లో చిరస్మరణీయ ఆటతో అభిమానుల గుండెల్లో నిలిచిన తిలక్.. మూడేళ్ల క్రితం ప్రాణాంతకమైన జబ్బుతో బాధ పడ్డాడు. ఇప్పటివరకూ రహస్యంగానే ఉన్న ఈ విషయాన్ని 'బ్రేక్‌ఫాస్ట్ విత్ ఛాంపియన్స్' అనే షోలో వెల్లడించాడీ చిచ్చరపిడుగు. ఇంతకూ ఆ సమస్య నుంచి ఎలా బయటపడ్డాడో తెలుసుకుందాం..

పొట్టి క్రికెట్‌లో దూకుడే కాదు పరిస్థితులకు తగ్గట్టు ఆడడం ఎంతో ముఖ్యం. అవసరాన్ని బట్టి గేర్ మార్చి.. మ్యాచ్ విన్నర్‌గా నిలిచే ఆటగాళ్లు కొందరే. అలాంటి వాళ్లలో తిలక్ వర్మ ఒకడు. గత రెండు ఐపీఎల్ సీజన్లలో పరుగులు వరద పారించిన ఈ యువకెరటం.. టీమిండియా తరఫున హ్యాట్రిక్ టీ20 శతకాలతో చరిత్ర సృష్టించాడు. ఆటే కాదు ఫిట్‌నెస్‌లోనూ తిరుగులేని తిలక్.. గడ్డు రోజుల్ని ఎదుర్కొన్నాడు. 2022లో భారత ఏ జట్టుతో పాటు బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లాడీ యంగ్ క్రికెటర్.

తొలి అనధికారిక టెస్టులో విధ్వంసక బ్యాటింగ్ చేసిన ఈ లెఫ్ట్ హ్యాండర్ 33 బంతుల్లోనే సెంచరీ కొట్టేశాడు. .. అయితే.. ఆ తర్వాత ఒక్కసారిగా అనారోగ్యంతో ఇబ్బంది పడ్డాడు. అప్పటిదాకా దంచేసిన అతడు 101ఆ సమయంలో ముంబై ఇండియన్స్ సహ యజమాని ఆకాశ్ అంబానీ.. బీసీసీఐ ఎంతో సహకరించారు. వెంటనే ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు. వారి సాయాన్ని నేను మరువలేను అంటున్నాడీ ఆసియా కప్ హీరో.

'బ్రేక్‌ఫాస్ట్ విత్ ఛాంపియన్స్' అనే టీవీ షోలో హోస్ట్ గౌరవ్ కపూర్ తో మాట్లాడుతూ సంచలన విషయాలు పంచుకున్నాడు తిలక్. 'నా మొదటి ఐపీఎల్ తర్వాత ఆరోగ్య సమస్యలు మొదలయ్యాయి. అయితే.. నేను ఫిట్‌గా ఉండేందుకు ప్రాధాన్యం ఇచ్చేవాడిని. కానీ, నా వల్ల కాలేదు. ఆ సమయంలోనే.. 'రాబ్డోమయోలిసిస్' అనే ప్రాణాంతకమైన వ్యాధి ఉన్నట్టు నిర్ధారించారు వైద్యులు. ఈ జబ్బు సోకిందంటే ఒంట్లోని కండరాలు విరిగిపోతాయి. టెస్టు జట్టులో చోటే లక్ష్యంగా పెట్టుకున్న నేను దేశవాళీలో ఆడుతూ.. ఏ సిరీస్‌లో రాణిస్తున్న రోజులవి. ఐస్ బాత్ మాత్రమే చేసేవాడిని. అయితే.. నా శరీరానికి కోలుకునేందుకు తగినంత సమయం ఇవ్వలేదు. విశ్రాంతి తీసుకోవాల్సిన రోజుల్లోనూ జిమ్‌కు వెళ్లేవాడిని. ఫలితంగా కండరాల మీద ఒత్తిడి పెరిగి.. ముక్కలవ్వసాగాయి. ఫలితంగా.. నరాలు చాలా గట్టిగా మారేవి. అప్పుడు నేను బంగ్లాదేశ్‌లో ఏ జట్టుతో అనధికారిక టెస్టు ఆడుతున్నా. కండరాల నొప్పిని భరిస్తూనే సెంచరీ కొట్టాను. కానీ, శతకం తర్వాత నా కళ్లు మసకగా మారాయి.

## అభిమానులకు బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చిన డైరెక్టర్..

# 'స్పిరిట్' అప్డేట్‌తో భారీ హైప్




మూవీ న్యూస్, 24 అక్టోబర్ (కెరటం న్యూస్): పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రాజెక్ట్స్‌ల్లో మోస్ట్ అవైటెడ్ సినిమా 'స్పిరిట్'. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. 'యానిమల్'తో హిట్ అందుకున్న సందీప్ మరోసారి మ్యాజిక్ చేయబోతున్నాడు. ప్రస్తుతం దర్శకుడు నటీనటులను ఫైనల్ చేసే పనిలో పడ్డాడు. ఈక్రమంలో.. అక్టోబర్ 23న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చాడు. 'సౌండ్ స్టోరీ ఆఫ్ ది ఫిలిం స్పిరిట్' పేరుతో చిన్న గ్లింప్స్ వీడియోను షేర్ చేశాడు. ఇక ఇందులో.. ఐపీఎస్ అధికారిగా ప్రభాస్ నటిస్తుండగా.. ప్రకాష్ రాజ్ వాయిస్‌తో వీడియోను ఎడిట్ చేశారు. "వీడి గురించి చాలా విన్నాను.

యూనిఫామ్ ఉన్నా.. లేకపోయినా ప్రవర్తనలో తేడా ఉండదని ఖైదీ యూనిఫాంలో ఎలా ప్రవర్తిస్తాడో చూద్దాం. వీడి బట్టలూడదీసి మెడికల్ టెస్ట్‌కు పంపించండి అంటాడు?. ఇక ప్రభాస్.. మిస్టర్ సూపర్‌డెంట్ చిన్నప్పటి నుంచి నాకు ఒక బ్యాడ్ హ్యాబిట్ ఉంది" అని చెప్పిన డైలాగ్ హైలెట్‌గా నిలిచింది. అంతటితో గ్లింప్స్ పూర్తి అయినప్పటికీ ప్రేక్షకుల్లో భారీ హైప్‌ను క్రియేట్ చేశారు. ఇదే ఇలా ఉంటే.. ఇంకా టీజర్ ఎలా ఉంటుందో అని అభిమానులు ఎక్సైట్ అవుతున్నారు. కాగా.. ఈ సినిమాలో ప్రభాస్ సరసన త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా.. వివేక్ ఒబెరాయ్, కాంచన, ప్రకాష్ రాజ్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో విడుదల కాబోతుంది.